# దేవత

భట్టిప్రోలు కృష్ణమూర్తి



**1966**వ సంవత్సరం.

అక్టోబర్ నెల అయిపోవస్తూంది.

తుని స్టేషన్.

నెమిలికళ్ళ విసనకర్రలూ, తమలపాకుల కట్టలూ, జీడిపప్పు, లక్కరంగు బొమ్మలూ, చక్కెరకేళీ, అరటిపళ్ళూ—

"ఆయ్, ఎవరిక్కావాలండీ?" రక రకాల గొంతుకలో అమ్మేవాళ్ళ అరపులు.

శారద రైల్వే గైడ్‌చూసి వాచీ చూసుకుంది. సరిగ్గా టైముకే నడుస్తూంది మెయిలు.

మూడు గంటలలో జగన్నాధపురం చేరుకుంటుంది తాను.

జగన్నాధపురం—

లలిత—

ఢిల్లీలో పెద్ద ప్రభుత్వోద్యోగిగా పనిచేసి రిటైరైన తర్వాత వాళ్ళనాన్న జగన్నాధరావు విశాఖపట్నానికి పదిమైళ్ళ దూరంలో తన పేరిట స్థాపింపబడిన జగన్నాధపురం అన్న చిన్న ఊళ్ళో ఉంటున్నారు పదేళ్ళుగా. ఫలసాయమూ, వ్యవసాయమూ అంతా అధునిక పద్ధతిలో నడిపిస్తున్నారు ఆయన. పాల వ్యాపారము కూడా భారీఎత్తున నిర్వహిస్తున్నారు. ఒక చిన్న కొండ మీద కట్టిన బంగళాలో వాళ్ళ నివాసం.

ఆయన ఏకైక పుత్రిక లలిత చిన్నప్పుడు తనతో కలిసి థర్డుఫారం చదివింది బెజవాడలో. ఉత్తరాల ద్వారా ఆ స్నేహం నిలుపుకుని రెండు మూడుసార్లు కలుసుకున్నారు వాళ్ళిద్దరూ ఈ పన్నెండేళ్ళలోనూ. బి. ఏ. చదువుతుండగా లలితకు పెళ్ళైపోయిందిగాని భర్త ప్రస్తుతం స్టేట్స్‌లో కాలిఫోర్నియాలో ఉన్నత విద్యాభ్యాసంలో ఉండటం వలన సంవత్సరంగా పుట్టింట్లోనే ఉంటూంది ఆమె.

దసరా శెలవులు సరదాగా గడుపుదామని తనను రమ్మనీ రాసింది ఆమె. వాల్తేరు స్టేషన్‌కు ఈపాటికి వాళ్ళకారు వచ్చి తనకోసం కాచుకుని ఉంటుంది.

సీటుమీద వెనక్కు చేరబడి పత్రిక పేజీలు విప్పింది ఆమె. ఇంతలో నెమలికళ్ళ విసనకర్రల మనిషి వచ్చి కిటికీ గజాల నడుమ నుండి ఒక విసనకర్ర లోపలికి దూర్చి "ఆయ్ ఎవరిక్కావాలండి, చాలా చవకండి—" అనడంతో విసుగుగా మొహం ఆ ప్రక్కకు త్రిప్పి వద్దన్నట్లు తలూపింది ఆమె. ఆ మనిషి వెళ్ళిపోయాడు.

ఆ పెట్టె సరిగ్గా భోజన పదార్థాలు అమ్మే దగ్గర నిలబడి ఉంది. అక్కడ ప్రయాణీకులు తొందరగా తిని పారేసిన ఆకులూ, కాగితాలూ ఏరుకుని నాకుకుంటూ తమలో తాము దెబ్బలాడుకునే భారతమాత సంతానం కొంతమంది ఆమె కళ్ళబడ్డారు.

ఆకలి బాధ తెలియకుండా పెరిగిన పిల్ల కనుక ఆమె ఏవగింపుతో దృష్టి మరల్చుకుని ఆకాశం మీదికి చూసింది. డేగలూ, కాకులూ, చాలా ఎగురుతున్నాయి క్రిందుగా.

రైలు కదిలింది.

* * *

అనకాపల్లి స్టేషన్. వాచీ చూసుకుంది ఆమె. రావలిసిన టైముకన్నా అయిదు నిముషాలు ముందే చేరుకుంది మెయిలు ఆ స్టేషను.

అయితే—

మరి కదలడం మటుకు ఎంతసేపటికీ కాలేదు.

ఇనుపగణాలు అడ్డుగా ఉండడాన్ని కిటికీ లోంచి తల అవతలకు పెట్టడానికి వీలుకాలేదు ఆమెకు. ప్రక్కకుతిరిగి చూడగా తను కూర్చున్న కుపేలో తక్కినవాళ్ళు కనిపించలేదు. ఒక బెంగాలీ ముసలావిడతప్ప. బెంగాలీలో ఏదోఅంది ఆమె. ఆ భాషరాని శారద ఇంగ్లీషులో ఏమిటని అడిగింది. ఆ ముసలావిడకు ఇంగ్లీషు రాకపోవ డాన్ని సంభాషణ సాగలేదు.

ఏదో క్రాసింగ్‌కోసం ఆపి ఉంటారను కుంది ఆమె. అంతగా పట్టించుకోక పత్రిక చదువుకోవడం మొదలుపెట్టింది.

కొంతసేపు గడిచిన తర్వాత పత్రిక ప్రక్కను పడేసివెళ్ళి ఆ పెట్టె గుమ్మందగ్గర నిలబడింది.

గుంపులు గుంపులుగా చాలామంది ప్లాట్ ఫారంమీద ఉన్నారు. అవతలకూడా రోడ్డుమీద చాలామంది మనుష్యులు మూగిఉండడం కని పించింది. ఏదో అంతా గోలగా అనిపించింది ఆమెకు.

ఎరుపుగళ్ళ బుష్‌కోటు తొడుక్కున్న ఒక వ్యక్తి ఆ కంపార్ట్‌మెంట్‌దాటి వెళ్తున్నాడు.

ఏమిటని అతన్ని అడుగుదా మనుకుంది శారద.

కాని అతని కళ్ళల్లో కదలే ఏవో అసభ్య మైన వెలుగులు ఆమె గొంతులో ప్రశ్నను అక్కడే ఆపేశాయి.

ఎర్రగళ్ళ బుష్‌కోటు ముందుకు వెళ్ళిపో యింది.

ఆ పెట్టె ముందు నిలబడి ఉన్న ఒక గుంపు ప్రయాణీకులు వాళ్ళలోవాళ్ళు మాట్లాడుకోవడం విన్నా ఆమెకు పరిస్థితి బోధపడింది.

విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంట్ నెలకొల్పమని కేంద్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయడానికి ప్రజాం దోళన మొదలై జనసమూహంవచ్చి రైలు ఆపేశారు.

భయంగా అనిపించింది ఆమెకు. తాను ఒంటరిగా ప్రయాణం చేస్తూంది.

దూరంనుండి కేకలు వినిపిస్తున్నాయి.

* * *

సాయంత్రం అయిద్దైంది. మెయిల్ మటుకు ఇంకా అక్కడేఉంది. మరి ఆ వేళ కదిలే ఆశ లేదని అంటున్నారు అందరూ. అంతవరకూ తమలోతాము మాట్లాడుకోని ప్రయాణీకులుకూడా ఎంత అర్జంటు పనిమీద తాము బయల్దేరింది, ఈ విధంగా మధ్యంతరంగా రైలు ఆగిపోవడం వల్ల తమకు ఏ విధంగా నష్టం కలుగుతూందీ వివరించడం మొదలుపెట్టారు తక్కినవాళ్ళకు.

డజన్ అర్ధరూపాయ చొప్పున మొదట్లో అమ్మిన అరటిపళ్ళు అప్పుడే రెండు రూపాయ లకు చెలామణీ అవుతున్నాయి.

పిల్లల ఏడుపులూ. పెద్దవాళ్ళ విసుర్లూ. కసుర్లూ. అంతకంతకూ ఎక్కువ స్థాయిని చేరు కుంటున్నాయి.

ఈ విధంగా దూర ప్రయాణీకులను అల్లరి పెట్టి హింసించడం చాలా ఘోరమని గట్టిగా భావిస్తున్నారు చాలామంది. ప్రయాణీకులు కాని వాళ్ళ గుంపులు మటుకు ఈ ఘనకార్యం చేస్తు న్నందుకూ, స్టీలు ప్లాంట్ వచ్చి విశాఖ పట్నం జిల్లా బాగుపడ్డనాడు అందరూ తమకు కృతజ్ఞత చూపవలసినందుకూ గర్వంగా తృప్తిగా మొహాలు పెట్టి నినాదాలు చేస్తున్నారు. మధ్య మధ్యలో ఆంధ్ర మాత తన పేరిట వీర సంతానం చేసే జయధ్వానాలు అందుకుంటూంది.

ప్రయాణీకుల్లో వేడిరక్తం కలవాళ్ళు గొంతు చించుకుని మూకలతో వాదించారు చాలా సేపు. చివరకు మరి లాభం కనిపించక అందరూ నిస్సహాయ స్థితిలోనికి దిగజారిపోయారు.

* * *

ఎప్పుడూ జన్మలో ఆవిధంగా బకెట్‌లో కడి గిన కప్పుతో టీ త్రాగక పోయినా అప్పుడు మటుకు మరి గతిలేక శారద అర్ధరూపాయ పెట్టి ఒక కప్పు కొనుక్కొని టీ త్రాగింది.


అక్కడి వర్తక బృందం ప్రయాణీకులకు రాత్రికి భోజనాల ఏర్పాటేదో చేస్తారని ఎవరో అనడం వినపడింది ఆమెకు రాత్రికి భోజనం అక్కర్లేదుగాని తన నెలాగైనా ఎవరైనా వాళ్లేరు చేరిస్తే బావుండును అనుకుంది మన స్సులో — అది వీలుపడని పని అని తెలిసినా.

తనలా బాధపడే ప్రాణాలు వేలకొద్దీఉన్నాయి ఈ మెయిలులో.

నలుగురిలో నారాయణ అనుకుని సర్దిచెప్పు కోడానికి ప్రయత్నించింది ఆమె.

"భోజనాల్లేవు. ఏమీలేవు. అంతా పుకారు. ఇంత మందికి భోజనాలెవడు పెడ్తాడు?" అను కుంటూ ఎవళ్ళో కిటికీ ప్రక్కనుండి వెళ్తు న్నారు.

అంతకు కొద్ది నిముషాల క్రిందటే టీ తాగినా ఉన్నట్లుగా ఉండి దాహంగా ఉన్నట్లు అనిపిం చడం మొదలుపెట్టింది ఆమెకు. తన వాటర్ బాటిలులో నీళ్ళు అయిపోయి చాలా సేపైంది. అటూ ఇటూ చూసి చివరకు పెట్టెదిగివెళ్ళి నీళ్ళు పట్టి తెచ్చుకుని గడగడా త్రాగింది.



కూరగాయలు కొందామని సంచీ పుచ్చుకుని మార్కెట్టుకొచ్చారు గుర్నాధంగారు—

"వంకాయలెలా యిస్తున్నావోయ్?" అడి గారు ఒక కొట్లో — "కిలో ముప్పావలా!" చెప్పాడు దుకాణదారు.

"అబ్బో చాలా ధర చెప్తున్నావే"— పక్క కొట్లో అడిగారు—"కిలో రూపాయి!"—

"హారినీ! వాడికన్నా ఎక్కువ చెపుతున్నావే. నేను వెర్రివాణ్ణనుకున్నావా!" అని ఇంకో కొట్లోకి వెళ్ళారు—

"వంకాయలు కిలో ఎంత?"

"రూపాయి పావలా!!"

"ఇదేం అన్యాయంవోయ్? మొదటి కొట్లో ముప్పావలా, రెండవకొట్లో రూపాయి, నీ దగ్గిర రూపాయి పావలానా?"—

"అవునండీ ధరలంత తొందరగా పెరిగిపో తున్నైమరి! తొరగా తీస్కోండి, లేకపోతే రూపాయిన్నరౌతుంది!"

—తుంగతుర్తి రామకుమార్, హైదరాబాదు-20



యువకుడు యువతితో
మన యిరువురిలో వున్న చదువు తేడాకు ఫరవాలేదులే. ఎందువల్లననగా అధికారులు నా కిచ్చిన డిగ్రీకి విలువలేదని ప్రకటించారు.

# దేవత

వాటర్ బాటిల్ కొక్కానికి తగిలిస్తూ ఉండగా "మిస్. శారద నువ్వేకదూ అమ్మా?" అన్న మృదువైన గొంతువిని ఉలిక్కిపడి వెనుకకు తిరిగి చూసింది.

తెల్లని బట్టలలో ఉన్న పొడవుపాటి ఒకాయన చిరునవ్వుతో తనవైపు చూస్తున్నారు. జుట్టంతా నెరసిపోయి ఉంది ఆయనకు. కాని శరీరం మటుకు దార్ఢ్యంగా ఆరోగ్యవంతంగా నిగనిగలాడుతూ ఉంది.

ఎందుకో ఒక్కసారిగా ఎంతో ధైర్యంగా అనిపించింది ఆమెకు – ఆయనెవరో తెలియక పోయినా.

"అవును... మీరు... తమరు...?"

ఆమె ప్రశ్న పూర్తి కాకుండానే సమాధానం చెప్పారు ఆయన "లలిత మా అమ్మాయి ...జగనా ధరావు..."

ఆశ్చర్యంగా ఆయన మొహం చూసి "మీరా? నమస్కారం. ఎలా వచ్చారు?" అంది ఆమె.

"అదంతా తర్వాత చెప్తాను. ముందుపద. ఇంటికి వెళ్దాం. నీ సామాన్లు ఇవేనా ?"

ముందుకువచ్చి తను సమాధానం చెప్పే లోగానే తన లెదర్ సూట్‌కేసూ, ఫ్లాస్కూ, వాటర్ బాటిలూ తీసుకుపట్టుకుని "ఇంతేనా?" అని అడిగారు.

"అంతే, నాకివ్వండి. నేను పట్టుకుంటాను." అని పెట్టెవైపు చేయి జాపింది శారద.

"అక్కర్లేదు. పదమ్మా." అంటూ దారి తీశారు ఆయన. పత్రిక చేతిలో పెట్టుకుని ఆయన వెనుకే నడిచింది ఆమె.

జన సమూహం మధ్యనుండి దారిచేసుకుని ప్లాట్‌ఫారం అవతల నిలబడివున్న కారుదగ్గరకు వెళ్ళారు వాళ్ళు.

చీకటి పడిపోయింది.

కారు కదిలేముందు ఆయనచెప్పారు. మెయిల్ ఇలా ఆపేశారన్న సంగతితెలిసి తిన్నగా నేను అనకాపల్లికే వచ్చానని ఎప్పుడూ తనను చూడక పోయినా అంతమందిలోనూ తనను ఎలా పోలిక పట్టగలిగారని అడుగుదామనుకుంది శారద. కాని ఆయన "వేగం వెళ్ళాలి మనం. కారు నడుపుతున్నప్పుడు మాట్లాడడం అలవాటులేదు నాకు. ఏమీ అనుకోకు" అంటూ కారు స్టార్టు చెయ్యడంతో మరేమీ అనలేదు ఆమె.

కారు జోరుగావెళ్తోంది. అక్కడక్కడ గుంపులు గుంపులుగా మనుష్యులు కనిపించారుగాని వాళ్ళ కారు ఎవరూ అడ్డడానికి ప్రయత్నించలేదు.

మూకలు నిప్పంటించి కాల్చిన స్కూటరూ, జీపూ, బస్సూ మొదలైనవి దారిలో కనిపించాయి ఆమెకు. స్ట్రైక్ ప్లాంటుకూ వీటికీ సంబంధమేమిటో అని అనుమానం వచ్చింది.

ఒకచోట దారిలో అడ్డుగా వరుసగా పెట్టిన పెద్దపెద్ద రాళ్ళు కనిపించాయి. ముందుగా. కారు జోరు తగ్గకపోయేసరికి భయంగా అనిపించి "రాళ్ళు..." అని ఏదో అనబోయింది ఆమె. గాభరా పడవద్దన్నట్టుగా ఎడమచెయ్యి పైకెత్తి ఊపి, ఆ రాళ్ళ దగ్గరకురాగానే సడన్‌బ్రేక్‌వేసి కారును సర్కస్ ఫీటులాగా అవతలకు ఆయన గెంతిస్తుండగా ఆమె గుండెలు దడదడ కొట్టుకున్నాయి, భయంవేసి. కాని మళ్ళీ కారు పజావుగా జోరుగా వెళ్తూండడమూ, తనవైపు తిరిగి ఆయన చిరునవ్వు నవ్వడమూ చూసి గుండెదిటవు తెచ్చుకుంది శారద.

• • •

ఘాట్ రోడ్డుమీదవెళ్ళి కొండ ఎక్కిందికారు. అది వాళ్ళ బంగళా గేటుదగ్గరకు వెళ్ళగానే వేసిఉన్న గేటు నెమ్మదిగా తెరుచుకుంది.

ఎవళ్ళన్నా ప్రక్కను నిలబడి తెరిచారో ఆటోమేటిక్ అరేంజ్‌మెంటు ఏదన్నా ఉందో ఆమె తెలుసుకునే లోగానే కారు ప్రక్కకుతిరిగి గేరేజివైపు వెళ్ళింది. కారు దగ్గరకు రాగానే దాని తలుపులూ తెరుచుకున్నాయి.

కారు లోపలికి తీసుకువెళ్ళి ఆపి, ఇంజన్ ఆపి, ఆయన అవతలివైపునుండి దిగుతుండగా అంతకుముందే ఫ్లాస్కూ, వాటర్ బాటిలూ భుజానికి వ్రేళ్ళాడదీసుకున్న శారద సూట్‌కేస్ చేత్తో పట్టుకుని తానూ దిగింది. ఈసారి ఆ సామాన్లు పట్టుకునే ప్రయత్నం చెయ్యలేదు ఆయన.

ఇద్దరూ గేరేజినుండి పైకివచ్చారు. తలుపులు వాటంతట అవే మూసుకున్నాయి. ఆయన ఏదో మీటనొక్కి ఉంటారు అనుకుంది శారద.

ఇంటిముందు స్తంభంమీద వెలుగుతున్న దీపపు వెలుతురులో ఆ ఆవరణంతా బాగా కనిపిస్తోంది. ముందు వరండామీద ఎవళ్ళో ఇద్దరు మాట్లాడుకుంటున్నారు.

ఆయనముందూ, తాను వెనకా నడుస్తున్నారు. మెట్లకి ఒక పది పదిహేనుగజాల దూరంలో ఆయన ఆగి ఆమె ముందుకు నడవడానికి దారి ఇస్తూ అన్నారు: "తాళాలు మరిచిపోయాను కారులో. నువ్వు పద, వస్తానిప్పుడే."

ఆయన గేరేజివైపు వెళ్ళగా తాను ముందుకు నడిచింది శారద.

నాలుగడుగులు వేయగానే అపడే ఆమెను గమనించిన వరండాలోని ఒక మనిషి "ఎవరది" అన్నాడు.

తలమీద చేతులు పెట్టుకుని కూర్చున్న రెండోవ్యక్తి తలపైకెత్తి శారదను చూసి హఠాత్తుగా నిలబడి "ఆ అమ్మాయిగారే కాబోలు శారదమ్మగారు వచ్చేశారు." అంటూ ఒక్కఉదుటన లోపలికి వెళ్ళాడు.

మెట్లెక్కుతున్న తనను వింతగా చూస్తున్న మనిషివైపుచూసి చిరునవ్వు నవ్వి అంది శారద: "అవును శారదనే."

ఇంతలో గుమ్మంతెరలు తొలగించుకుని లోపలినుండి వరాండామీదికి వచ్చింది లలిత.

ఏడుస్తున్నట్టుగా ఉంది ఆమె మొహం, జుట్టంతా రేగిపోయింది.

"శారదా! ఎలా వచ్చావు శారదా?" అంది ఆశ్చర్యంగా ఆమె.

శారద చేతిలోనుంచి సూట్ కేస్ తీసుకున్నాడు అక్కడ ఉన్న మనిషి.

శారద అంది: "తిన్నగా అనకాపల్లి వచ్చారు నాన్నగారు కారు తీసుకుని నా కోసం."

లలిత అడిగింది ఆశ్చర్యంగా: "నాన్నగారా? మీ నాన్నగారుకూడా వచ్చారా?"

"మా నాన్నగారేమిటి? మీ నాన్నగారు..."

కళ్లు పెద్దవిగా విప్పి, నోరు తెరుచుకుని అలాగే ఉండిపోయింది లలిత నాలుగైదు క్షణాలు.

"ఏమిటది లలితా అలా చూస్తున్నావు?" అంటూ శారద ఒక అడుగువేసి లలిత భుజంమీద చేయి వేస్తుండగానే కళ్ళుమూసుకుని తూలిపడిపోబోయినట్లయింది లలిత. శారద ఆమెను పడిపోకుండా పొదివి పట్టుకుంది.

ఇంతలో లోపలినుండి రెండవమనిషి పైకి వచ్చాడు. మొదటి మనిషి అన్నాడు అతనితో: ఏవిటో అంతాఆశ్చర్యంగా ఉంది. అమ్మాయిగారి కళ్ళు తిరిగినట్లున్నాయి. పదండి లోపల పడుకో బెడ్తాం."

స్పృహతప్పిపోయి క్రిందికి జారిపోతున్న లలితను అందరూకలిసి లోపలికి తీసుకువెళ్ళి సోఫామీద పడుకో బెట్టారు.

అంతా అయోమయంగా ఉన్న శారద అడిగింది వాళ్లను గాభరాగా: "ఏమిటైంది? ఎందుకిలా అయిపోయింది లలిత?"

మొదటిమనిషి అన్నాడు: "ఏమిటోనమ్మా—విడ్డూరం, మీ కోసమని బాబుగారూ ఈ డ్రైవరూ పన్నెండు గంటలకి ఫోంచేసి బయల్దేరి వాల్తేరెళ్లారు. అక్కడి గోలంతావిని తిన్నగా అనకాపల్లికే వెళ్దామని బయల్దేరారట. కాని దారిలో అల్లరిమూకలు ఆ కారాపేసి అల్లరి పెట్టారట. బాబుగారికి కోపంవచ్చి వాళ్లతో వాదిస్తుండగా ఎవరో పెట్రోలుపోసి కారుకి నిప్పంటించేశారట ఇంకెవరో కత్తితో పొడిచేశారట బాబుగార్ని. నెత్తురులు కార్తూ బాబుగారు నేలమీద ఒరిగిపోతుండగా ఈ డ్రైవరు మటుకు వాళ్ల చేత తన్నులు తిన్నా ఎలాగో తప్పించుకుని కొంత దూరం నడిచీ కొంతదూరం ఏదో లారీఎక్కి—అడ్డుతోవనివచ్చి ఇప్పుడే అరగంట క్రిందట ఇక్కడికి చేరుకున్నాడు, ఇంట్లో అమ్మగారూ, అమ్మాయిగారూ తప్ప ఇంకెవ్వరూ లేరు. ఈ సంగతి విని అమ్మగారు మూర్ఛబోయారు. ఇంతలో మీరొచ్చారు, మేమిద్దరమూ ఏం చెయ్యడమా అని మాట్లాడుతూంటే, మరి కారులో బాబుగారు మిమ్మును తీసుకొచ్చారన్నారు. కారేదీ? బాబుగారేరి?"

లలిత మొహంమీద నీళ్ళుజల్లి తుడుస్తున్న శారద ఆశ్చర్యంగా అతనివైపుచూసి అంది: "గేరేజిలో కారు పెట్టివస్తూ తాళాలు మరిచిపోయానని బాబుగారు వెనక్కి వెళ్లారు. ఇంకా రాలేదేం చెప్మా!"

ఈ మాటలువిన్న డ్రైవరు ఒక్క ఉదుటున అవతలకు వెళ్లాడు.

ఆ మొదటిమనిషి అంటున్నాడు. "ఈడ్రైవరు మాటలు బట్టిచూస్తే బాబుగారికి బలంగానే దెబ్బ తగిలి ఉండాలి. నెత్తురుతో బట్టలు తడిసిపోవడం చూశానన్నాడు. వాళ్లను తప్పించుకుని మీకోసం మళ్లా ఇంకోకారు తీసుకుని అనకాపల్లి వెళ్లడమూ, అంతావింటూంటే ఏదో ఆశ్చర్యంగా ఉంది. నమ్మడమో మానడమో తెలియకనే అమ్మాయిగారు మూర్ఛపోయారు."

వెళ్లిన డ్రైవరు ఒక్కఉదుటునతెర గుమ్మం తెరలు తొలగించుకుని అన్నాడు. "ఏ కారు గేరేజిలోలేదే! అసలు వచ్చినట్లు చప్పుడే వినిపించలేదు మాకు! ఏమిటిదంతా?"

అతనిమొహం భయంతో వికారంగా తయారయింది.

దడ దడ కొట్టుకునే గుండెలతో అతనివైపే చూస్తున్న శారద "అమ్మో "అని ఒక వెర్రికేక పెట్టి ఆసోఫామీద ఉన్న లలితమీదికి ఒరిగిపోయి తానూ మూర్ఛపోయింది.

* * *

అందరూ నిశ్శబ్దంగా విన్నారు రాజారావు వ్రాసిన ఈ కథ. ఏ కామెంట్లూ చెయ్యకుండా.

చదవడం ముగించి కాగితాలుమడిచి బల్లమీద పెట్టి "ఎలా ఉంది?" అన్నట్లుగా అందరివైపూ చూశాడు రాజారావు. పెళ్ళి చూపులవేళ కన్నకుమార్తెను మొగపెళ్ళివారికి చూపిస్తున్న ఆడపిల్లతండ్రి మొహంలాఉంది అతని మొహం.

అప్పారావు అన్నాడు. "మామూలు దెయ్యాల కథ—అయితే ఆఖరువరకూ దెయ్యంకథ అనుకోలేదు నేను."

వర్ధమాన రచయిత్రి రాజ్యలక్ష్మి అంది: "ఏదో లూజుగాఉంది. బిగిలేకుండా. ఇంకా చిత్రిక పట్టాలి.

రాజకీయాల్లో తిరుగుతూన్న రమణారావు అన్నాడు: "ప్రతి రచనకీ ఏదోపరమార్థంఅంటూ ఉండాలి. ఇందులో నాకేమీ కనిపించలేదు ఏ పరమార్థమూ."

కళ్ళజోడుతీసి రుమాలుతో తుడుచుకుంటూ సీతారామయ్య అన్నాడు: "ఒక నీతిమటుకు కనిపిస్తూంది ఇందులో. మనుష్యులు దెయ్యాలుగా మారుతున్న ఈ రోజుల్లో దెయ్యాలుమనుష్యులుగా మారితే తప్ప ముక్తిలేదు మనదేశానికి."

చంద్రశేఖరం గంభీరంగా మొహంపెట్టి అన్నాడు: సీతారామయ్య అన్నది కొంతవరకు నిజమే. అయితే ఒకచిన్న ఎమెండ్ మెంట్-చనిపోయిన తర్వాత జగన్నాధరావు దేవతగా మారాడందాం. ఇదీ దేవతకథ." ●



"పుష్ప విలాసం"

ఫొటో : "లవర్ ఆఫ్ వీనస్" — ఏలూరు